లడ్డూ కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

సదాశివపేట, సెప్టెంబర్ 28: తిరుమల లడ్డును కల్తీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం విశ్వ హిందూ పరిషత్, హిందు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక బసవ సేవాసదన్ నుంచి తిలక్‌రోడ్, సుభాష్‌రోడ్డు మీదుగా గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాం ధీచౌక్ వద్ద అపచార ప్రాయశ్చిత్త హోమం నిర్వహించారు. లడ్డు తయారీలో జరిగిన తప్పులపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. లడ్డు వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దేవాలయంలో తిష్టవేసిన అన్యమత ఉద్యోగులను తొలిగించాలని డిమాండ్ చేశారు. హిందూ ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయలని కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఓటరు తుది జాబితా విడుదల

కంది, సెప్టెంబర్ 28: కంది మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను శనివారం విడుదల చేశారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ జాబితాను సిద్ధం చేశారు. కంది ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి ఓటర్ జాబితాను విడుదల చేశారు. మండలంలోని 212 వార్డులకు 37,312 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 18,870, పురుషులు 18,420 మంది ఉండగా, ఇతరులు 22 మంది ఉన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోహీర్‌లో 47,319 మంది ఓటర్లు

కోహీర్, సెప్టెంబర్ 28: మండలంలోని ఆయా గ్రామాల్లో మొత్తం 47,319ఓటర్లు ఉన్నారని ఎంపీడీవో భారతి వెల్లడించారు. శనివారం మండలంలోని పీచెర్యాగడి, మనియార్‌పల్లి గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కోహీర్‌లో అత్యధికంగా 10,485, దిగ్వాల్ 4096, బిలాల్‌పూర్ 3428మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. తక్కువగా సిద్దాపూర్ తండా 457, కొత్తూర్(డి) 563, పీచెర్యాగడి తండాలో 661 ఉన్నారని వివరించారు. పురుష ఓటర్లు 23,629 మంది, 23,689 మంది మహిళా ఓటర్లు, ఒక ప్రత్యేక ఓటరు ఉన్నట్లు పేర్కొన్నారు.

సవరించిన జాబితా విడుదల

సిర్గాపూర్, సెప్టెంబర్ 28: మండలంలోని అన్ని గ్రామాల్లో సవరించిన ఓటర్ల తుది జాబితాను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్సూర్‌నాయక్ విడుదల చేశారు. అనంతరం అన్ని గ్రామ పంచాయతీల్లో ఆయా సంబంధిత సెక్రటరీలు, ఓటర్ల జాబితాను విడుదల చేశారు. రెండు వారాల కితం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో వార్డుల వారీగా ఉంచిన ఓటరు జాబితాను పరిశీలించి మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో ఎంపీవో బ్రహ్మంచారి, సిబ్బంది ఉన్నారు. మండలంలోని లక్ష్మణ్‌నాయక్‌తండాను ఎంపీడీవో సందర్శించి, పంచాయతీ ఎన్నికల కోసం స్థానిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

కంది: ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

సంగారెడ్డి, సెప్టెంబర్ 28: రాజీయే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీతో 4,121 కేసులు పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. వివిధ రకాలు కేసుల్లో బాధితులకు రూ.3,21,67,337 నష్టపరిహారం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు జయంతి, కృష్ణార్జున్, లావణ్య బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో 286 కేసులు పరిష్కారం

జహీరాబాద్, సెప్టెంబర్ 28: రాజీ మార్గంతోనే కేసులు సత్వరం పరిష్కారమవుతాయని, తద్వారా డబ్బులు, సమయం ఆదా చేసుకోవచ్చాని జహీరాబాద్ మున్సిఫ్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు కాంప్లెక్స్‌లో సీనియర్ కోర్టు విభాగంలో ఎస్‌వోపీ, సివిల్, సైబర్ క్రైమ్‌తోపాటు 58 కేసులు పరిష్కారం కాగా బ్యాంకు సీఎల్పీ, ఎస్‌వోపీ, సైబర్‌క్రైమ్ కేసుల నుంచి రూ.7.51 లక్షలు వసూలయ్యాయి. జూనియర్ కోర్టు విభాగంలో 2 సీవిల్ కేసులు, క్రిమినల్ కాంపౌడ్ కింద 67 కేసులు, 99 సెకండ్ క్లాస్ కేసులు, 57 అడ్మిషన్ కేసులు పరిష్కారం కాగా రూ.1.72 లక్షలు వసూలు కావడంతోపాటు మొత్తం 286 కేసులు పరిష్కారమయ్యాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ సూరికృష్ణ తెలిపారు. అనంతరం ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి అనూష, బార్ ప్రెసిడెంట్ గోపాల్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

సంగారెడ్డి: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర

ఖేడ్‌లో 570 కేసులు పరిష్కారం

నారాయణఖేడ్, సెప్టెంబర్ 28: నారాయణఖేడ్ మున్సిపల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 570 కేసులు పరిష్కరించినట్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మందాని తెలిపారు. దీర్ఘకాలికంగా పర్కిష్కారానికి నోచుకోని కేసుల నుంచి విముక్తి కల్పించే వెసులుబాటు లోక్ అదాలత్ కల్పిస్తుందని తెలిపారు. ఇరువర్గాల సమ్మతంతో కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాణ్యతలో ఎలాంటి లోపాలుండొద్దు

నారాయణఖేడ్, సెప్టెంబర్ 28: విద్యార్థులకు భోజనం అందించే విషయంలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాల, వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం బోజనం అందించడంతోపాటు నాణ్యత లోపం ఉండకూడదని అన్నారు. వసతి గృహంలో మినర్‌వాటర్ పాయింట్ పాడైపోయిందని విద్యార్థులు సమస్యను చెప్పారు. వెంటనే మినరల్ వాటర్ ఫిల్టర్‌కు వెంటనే మరమ్మతులు చేయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, నాయకులు రమేష్ చౌహాన్, వివేకానంద, రామకృష్ణ, రాజేశ్, సయ్యద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

షకీర్(ఫైల్)

జహీరాబాద్, సెప్టెంబర్ 28: మండలంలోని బూచినెల్లి శివారులోని నారింజవాగు లో గల్లంతైన షకీర్ మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం వాగు పరిసరాల్లో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా సత్వార్ శివారులో షకీర్ మృతదేహం లభ్యమైంది. మూడు రోజులుగా గల్లంతైన వ్యక్తి కోసం తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు ఘటనాస్థలానికి మూడు కిలోమీటర్ల దూరంలో మృతదేహం లభించింది. మృతదేహాన్ని బయటకు తీసి పంచనామ అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జహీరాబాద్, సెప్టెంబర్ 28: జహీరాబాద్ పట్టణంలోని అల్లీపూర్ మాజీ ఎంపీటీసీ రాజేందర్ మృతిపై పలు పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. శనివారం దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్‌తోపాటు పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రేబిస్‌పై అవగాహన

జహీరాబాద్, సెప్టెంబర్ 28: రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ డీడీఎస్-కేవీకేలకు చెందిన పశు సంవర్ధక శాస్త్రవేత్త డాక్టర్ కైలాష్ అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పస్తాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేబిస్ ప్రాణాంతక అన్నారు. కుక్క కాటుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుక్క కరిచిన వెంటనే శుభ్రమైన నీటితో కడగాలని, వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేసుకోవాలని సూచించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సాయిప్రియాంక, రోజమ్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రానికి కార్మికుల జీవితాలు పట్టవా?

కలెక్టరేట్ వద్ద ధర్నాలో కూర్చున్న కార్మికులు, నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 28: ప్రధాని మోదీకి కార్మికుల జీతాలు, జీవితాల గురించి పట్టింపు లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఆరోపించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డి పట్టణంలో కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.29,610కు పెంచినట్టు సోషల్ మీడియాలో కేంద్రం తప్పుడు ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. కాంట్రాక్టు కార్మికులు 12 గంటలు పనిచేస్తున్నా రూ.12వేలు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని కార్మిక భవన్ వద్ద జరిగే ధర్నాకు కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, జిల్లా ఉపాధ్యక్షులు పాండు రంగారెడ్డి, ప్రవీణ్, రాజయ్య, సహాయ కార్యదర్శులు మైపాల్, యాదగిరి, బాగారెడ్డి, నాయకులు బాబురావు, నాగేశ్వరరావు, సురేష్, కొండల్‌రెడ్డి, శోభా, రమాదేవి పాల్గొన్నారు.

కార్పొరేట్ వ్యవసాయాన్ని వ్యతిరేకించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 28: కార్పొరేట్ వ్యవసాయాన్ని భగత్‌సింగ్ స్ఫూర్తితో వ్యతిరేకించాలని, అందుకు పోరాటం చేయడానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జయరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు

గుమ్మడిదల, సెప్టెంబర్ 28: భగత్‌సింగ్ సేవలు ఆదర్శనీయమని పలు పార్టీల నాయకులు కొనియాడారు. శనివారం మండల కేంద్రమైన గుమ్మడిదలతోపాటు బొంతపల్లిలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ మద్దుల బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు మందభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, కంజర్ల శ్రీనివాస్, మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

సంగారెడ్డిలో..

సంగారెడ్డి, సెప్టెంబర్ 28: ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర ఆధ్వర్యంలో పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫోరమ్ ప్రధాన కార్యదర్శి మహేశ్‌కుమార్, సహ కార్యదర్శి శ్రీకాంత్, సాయి వరాల, మల్లేశం, సాంబ పాల్గొన్నారు.

వేతన ఒప్పందం చేయాలి

నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కవేలి రాక్‌వూల్ పరిశ్రమ కార్మికులు

కోహీర్, సెప్టెంబర్ 28: మండలంలోని కవేలి రాక్‌వూల్(సెయింట్ గోబెన్) పరిశ్రమ యాజమాన్యం ఎనిమిది నెలలుగా కార్మికులకు అన్యాయం చేస్తున్నదని ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నారాయణ ఆరోపించారు. వేతన ఒప్పదం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యం మొండి వైఖరి నశించాలని శనివారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల మేలు కోసం వెంటనే వేతన ఒప్పదం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివరామారావు, మంజూర్‌అహ్మద్, పీరప్ప, లతీఫ్, శ్రీకాంత్, నారాయణ, వెంకటేశ్, తదితరులున్నారు.

సిర్గాపూర్ విద్యార్థికి తృతీయ స్థానం

విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం ఇస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

సిర్గాపూర్, సెప్టెంబర్ 28: ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పోస్టర్ తయారీ పోటీలో సిర్గాపూర్ పాఠశాలకు చెందిన విద్యార్థికి తృతీయ స్థానం దక్కిందని మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ శనివారం తెలిపారు. సిర్గాపూర్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి వంశీనాథ్‌ను డీఈవో వెంకటేశ్వర్లు అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. గ్రామాల్లో మంచి ప్రతిభ చాటే ఆణిముత్యాలు ఉన్నారని విద్యార్థి వంశీనాథం నిరూపించాడన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఖాజీపల్లిలో ఖాళీ బిందెలతో నిరసన


ఖాజీపల్లిలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

జిన్నారం, సెప్టెంబర్ 28: ప్రత్యేకాధికారుల పాలనలో కాజిపల్లి గ్రామంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయని మాజీ సర్పంచ్ సత్యనారాయణ ఆరోపించారు. రెండు నెలలుగా గ్రామంలో నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. గ్రామంలోని గుమ్మి ట్యాంకు వద్ద మహిళలు శనివారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కరెంటు, పారిశుధ్య సమస్య ఎక్కువైందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాజిపల్లికి వెంటనే తాగునీటితోపాటు నిత్యావసరాలకు నీటిని సరఫరా చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

జహీరాబాద్, సెప్టెంబర్ 28: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆసెంబ్లీని ముట్టడిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ హెచ్చరించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా సవతి తల్లి ప్రేమ చూపుతోందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.8 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, ఫీసు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో, ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరీశ్, అతీక్, సురేశ్, పృథ్వీ, ఆకాశ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతిపై సంతాపం

అందోల్, సెప్టెంబర్ 28: అనారోగ్యంతో అందోల్ మాజీ సర్పంచ్ రాచకొండ శారద (50) శనివారం మృతిచెందారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి అందోల్‌లో శారద మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె కోడలు కౌన్సిలర్ భవాని, కొడుకు పార్టీ సీనియర్ నాయకుడు నాగరత్నంగౌడ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకుముందు మున్సిపల్ వైర్మన్ మల్లయ్య, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రవీణ్, కమిషనర్ తిరుపతి పరామర్శించారు. డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు ప్రదీప్‌గౌడ్, వెంకటేశం లింగాగౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్

బాలికల ఆరోగ్య సంరక్షణకు కృషి

రామచంద్రాపురం, సెప్టెంబర్ 28: ఆర్సీపురం డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 400 మంది విద్యార్థినులకు సొసైటీ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్, జేకే ఫెన్నార్ ఇండియా లిమిటెడ్ సహకారంతో బాలికల ఆరోగ్య పరిరక్షణకు శానిటరీ ప్యాడ్స్‌ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ హాజరై మాట్లాడారు. బాలికల భద్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, సౌకర్యాల కల్పనకు పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ కవిత, ఎస్ఈడీ సంస్థ అధ్యక్షుడు క్రాంతివెలగపూడి, స్కూల్ హెచ్ఎం పీపీరాథోడ్, జేకే ఫెన్నార్ ప్రతినిధులు పద్మజ, మాధవి, టీచర్లు శోభ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ అందజేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

సర్కారు బడులకు కంప్యూటర్లు అందజేత

కంది, సెప్టెంబర్ 28: కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో అనుసంధానంగా కొనసాగుతున్న అక్షర దాన్(అక్షరమాల) వారి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు శనివారం కంప్యూటర్లను అందజేశారు. మండల పరిధిలోని చిమ్నాపూర్, కలివేముల, కంది ప్రభుత్వ పాఠశాలలకు గ్రామ పెద్దల సమక్షంలో ఒక్కో కంప్యూటర్‌ను అందజేశారు. ఐఐటీ హెచ్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ నరేశ్‌రాథోడ్ అక్షర దాన్ సభ్యులతో మాట్లాడి పాఠశాలలకు కంప్యూటర్లు అందించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణగౌడ్, సురేశ్ నాయక్, మహేందర్, రవి, ఆనంద్‌రావు, సత్తిరెడ్డి, రాజుగౌడ్, శ్రీనివాస్, రాములు, అశోక్, విట్టల్‌రెడ్డి, రాంచందర్, వీరన్న, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్లుగీత కార్మికులకు రక్షణ కల్పించాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 28: కల్లు గీత వృత్తిదారులకు కాంట్రాక్టర్ల నుంచి రక్షణ కల్పించాలని, జిల్లాలో కల్తీ కల్లును అరికట్టాలని గ్రామాల్లో బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు కోరారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్రకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లుగీత కార్మిక కుటుంబాలకు కాంట్రాక్టర్ల నుంచి రక్షణ కల్పించి కాపాడాలన్నారు. జిల్లాలో కాంట్రాక్టర్లు కల్లుగీత కార్మికుల దగ్గర ఉన్న లైసెన్సును బలవంతంగా తీసుకుని వ్యాపారం చేస్తున్నారన్నారు. లైసెన్సు ఇవ్వని వారిపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. గీత కార్మికులపై కాంట్రాక్టర్ల వేధింపులు ఆగడంలేదని, కల్లీకల్లు విచ్చలవిడిగా అమ్ముతున్నారన్నారు. గ్రామాల్లో రోజురోజుకు బెల్టుషాపులు పెరిగిపోతున్నా నివారించడంలో అధికారులు విఫలమవుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నర్సింలు, నాయకులు రాజయ్య, అశోక్, బాబూరావు, రమేశ్, బాలరాజు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

యూజీడీ పనులకు శంకుస్థాపన


యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి

బొల్లారం, సెప్టెంబర్ 28: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రూ.50 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శనివారం చైర్‌పర్సన్ రోజా బాల్‌రెడ్డి కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారు, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

మామిడిపల్లి పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

కంది, సెప్టెంబర్ 28: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు సూచించారు. కంది మండలం మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు జరుగుతున్న విద్యాబోధనను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, సౌకర్యాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో శ్రమదానం చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌స్వామి పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

బొల్లారం, సెప్టెంబర్ 28: మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పదో వార్డులో కౌన్సిలర్ నరసింహారాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కవి గుర్రం జాషువాకు ఘన నివాళి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 28: తారా కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం ఆధునిక తెలుగు కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్న ప్రసాద్, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ సుమతీదేవి, డాక్టర్ సంధ్య పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 28: జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు శనివారం ముగిశాయి. చివరిరోజు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ అమూల్యమ్మ ముగింపు వేడుకలో పాల్గొన్నారు. క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్రీడా పోటీల విజయవంతానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పూర్తిస్థాయిలో సహకరించారన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్